

ఆరుగాలం శ్రమ

ఆదాయం భ్రమ

- ప్రకృతికి ఎదురీదుతున్న రైతు
- అతివృష్టి, అనావృష్టితో కష్టాలు
- ప్రభుత్వం మరింత చేయూతనివ్వాలి
- గిట్టుబాటు ఉండాలి
- రైతులకు పింఛన్ ఇవ్వాలి
- నేడు జాతీయ రైతు దినోత్సవం

- ప్రత్యేక కథనం-7లో



ఇది పచ్చిక బయలు కాదు. కాల్వ పరిస్థితి ఇలా ఉంది. పాతవయ్యేరు కాల్వలో తూడు, గుర్రపుడెక్క పూడుకుపోవడంతో దిగువకు నీరు వెళ్లడానికి అడ్డంకిగా మారాయి. చినకాపవరం నుంచి కళింగగూడెం లాకుల వరకు సుమారు ఎనిమిది కిలో మీటర్ల మేర పాతవయ్యేరు కాలువ ప్రవహిస్తుంది. పలు గ్రామాలకు సాగునీరు, తాగునీరు అందిస్తుంది. ఈ కాల్వ దుస్థితిపై కథనం

- 8లో..



ప్రభుత్వ సొమ్ము బొక్కేశారు..

వీరంతా ప్రభుత్వ ఉద్యోగులు.. సీనియార్టీని బట్టి లక్షల్లో జీతాలు ఉంటాయి. అయినా వీరి ఆశకు హద్దులేదు. పన్నుల రూపంలో వసూలైన సొమ్ములు, పేదలకు చెందాల్సిన పథకాల సొమ్ములు బొక్కేశారు. ఉన్నతాధికారుల దర్యాప్తులో ఒక్కో అవినీతి బండారం బయటపడుతున్నది. అరెస్టులు, నిధుల రికవరీకి రంగం సిద్ధమైంది.

» రూ. 2.30 కోట్ల పంచాయతీ సొమ్ము పక్కదారి » కేసు నమోదు
» సస్పెన్షన్ కోసం ప్రభుత్వానికి సిఫారసు » చిన అమిరం పంచాయతీలోనూ దందా

భీమవరం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలో లక్షలాది రూపాయలు పక్కదారి పట్టించిన ఘనుడు అతడు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆయన చెప్పిందే వేదం. కార్యదర్శులుగా ఉంటూ కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడిన సాగిరాజు కిశోర్ గోపాలకృష్ణంరాజు(కిశోర్ రాజు), బి.జయరాజులపై జిల్లా అధికార యంత్రాంగం కొరడా ఝుళిపించింది. పంచాయతీ నిధులు దుర్వినియోగానికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జాల్లా కలెక్టర్ ఇటీవల ఆదేశాలు జారీచేశారు. నిధులు పక్కదారి పట్టించడంలో వెనుక ఉన్న సూత్రదారులపైనా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. భీమవరం రూరల్ మండలం రాయలం పంచాయతీలో వైసీపీ ప్రభుత్వంలో కిశోర్ రాజు, బి.జయరాజులు కార్యదర్శులుగా వ్యవహరించారు. వీరి హయాంలో రూ2.30 కోట్లు ఆస్తి పన్ను పక్కదారి పట్టింది. ముందుగా జయరాజు కార్యదర్శిగా వ్యవహరించారు. ఆ తర్వాత కిశోర్ రాజు ఇన్‌ఛార్జ్‌గా కొనసాగారు. కిశోర్ రాజు ఏకంగా రూ. 1.30 కోట్లు తన సొంత అకౌంట్‌లో జమ చేసుకున్నట్టు జిల్లా అధికారుల విచారణలో తేలింది. వీరికి జూనియర్ అసిస్టెంట్ సహకరించారు. ముగ్గురిపైనా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కిశోర్ రాజుపై అరెస్ట్‌వారెంట్ కూడా జారీ అయినట్టు సమాచారం. అవినీతి దందాలో కార్యదర్శి కిశోర్ రాజు ప్రమేయం ఎక్కువగా ఉందని అధికారులు గుర్తించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏజన్సీ ప్రాంతానికి ఆయనను బదిలీ చేశారు. పోలవరం నియోజకవర్గంలోని కుక్కునూరు మండలానికి బదిలీపై వెళ్లారు. ఇదే జిల్లాలో ఉండేందుకు కిశోర్‌రాజు చేయని ప్రయత్నం లేదు. అయినా జిల్లా అధికారులు అతని దందాను ముందుగానే పసిగట్టారు. ఏజన్సీ ప్రాంతానికి బదిలీ చేసేశారు. అలాగే పాలకొల్లు ఏరియా హాస్పిటల్లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కుంచె మురళి వెంక ట తులసీధర్ (26)ను ప్రభుత్వ నిధులు దుర్వినియోగం, చెక్కుల ఫోర్జరీ కేసులో శనివారం అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. సుమారు రూ. 62లక్షల వరకు నిధులు దుర్వినియోగం చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పేషెంట్ కేర్ అకౌంట్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డెవలప్‌మెంట్ సొసైటీ అకౌంట్, పి.ఎఫ్.ఎం.ఎస్ అకౌంట్‌లకు సంబంధించి లావాదేవీల విషయంలో నిధులు దుర్వినియోగం బయటపడింది.

దందా అంతా ఇంతా కాదు!

నాటి ఎమ్మెల్యే భరోసా వల్లే కార్యదర్శులు ప్రత్యేకంగా కిశోర్ రాజు బరితెగించారు. చిన అమీరం గ్రామ పంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శిగా పనిచేశారు. రాయలం గ్రామ పంచాయతీకి ఇన్‌చార్జిగా కొనసాగారు. రెండు పంచాయతీలు భీమవరం పట్టణానికి ఆనుకునే ఉన్నాయి. భీమవరం అంతా ఆ రెండు పంచాయతీల్లో విస్తరించింది. చిన అమిరం గ్రామ పంచాయతీలోనూ కిశోర్‌రాజు దందా అంతా ఇంతా కాదు. అక్రమ లేఅవుట్‌లలో ప్లాన్‌లు తీసుకోకుండానే ఇళ్ల నిర్మాణానికి అవకాశం కల్పించారు. వైసీపీ హయాంలో రూరల్ మండల ప్రజాప్రతినిధి చినఅమిరంలో నాన్ అవుట్ వేస్తే జిల్లా పరిషత్ నిధులతో రహదారి వేసేందుకు పూర్తి సహకారం అందించారు. సదరు రహదారిని స్థల యజమానులు పంచాయతీకి రాసిచ్చారు. పంచాయతీ అనుమతి లేనిదే జిల్లా పరిషత్ నిధులతో రహదారి వేయడానికి వీలులేదు. పంచాయతీ స్థలం కాబట్టి రహదారి వేశామంటూ కార్యదర్శి కిశోర్ రోజు తనను ప్రశ్నించిన వారికి వింత సమాధానం ఇస్తూ వచ్చారు. కానీ అక్కడ నివాసాలు లేవు. అయినా రహదారి వేయడంలో కార్యదర్శి ప్రధాన భూమిక వహించారు. అప్పటి ఎమ్మెల్యే సహకారం వల్లే కార్యదర్శి కిశోర్ రాజు రాయలం, చిన అమిరం పంచాయతీలో పెద్దమొత్తంలో సొమ్ములు కాజేసుకున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా చినఅమిరం పంచాయతీలోనూ విచారణ సాగుతోంది. అక్కడ ఎంత నిధులు దుర్వినియోగం అయ్యాయో విచారణ తర్వాత వెల్లడి కానుంది.

రాయలం ఆదాయం రూ. కోటి

రాయలం గ్రామ పంచాయతీలో ప్రతిఏటా ఆస్తి పన్ను రూపంలో కోటి రూపాయలు ఆదాయం వస్తుంది. ముందుగా జయరాజు అవతవకలకు తెరతీశారు. ఆ తర్వాత ఇన్‌చార్జిగా వచ్చిన కార్యదర్శి కిశోర్ రాజు అవినీతిని తారాస్థాయికి తీసుకువెళ్లారు. ఆస్తిపన్నును వసూలు చేసి ఏకంగా రూ.1.30 కోట్లు తన సొంత అకౌంట్‌లో వేసుకున్నట్టు అధికారుల విచారణలో తేలింది. అవినీతికి పాల్పడ్డ కార్యదర్శులను సస్పెండ్ చేయాలని పంచాయతీ రాజ్ కమిషనర్‌కు జిల్లా అధికారులు లేఖ రాశారు.

పన్ను ఎందుకు కట్టాలి..

రాయలం గ్రామ పంచాయతీ నైసర్గికంగా భీమవరం పట్టణంలో కలిసిపోయింది. అక్కడే అపార్ట్‌మెంట్‌లు వెలుస్తున్నాయి. స్థలాలు ధరలు భీమవరంతో పోటీ పడుతున్నాయి. ప్లాన్‌లకు డిమాండ్ ఉంటోంది. ప్రతిఏటా కోటి రూపాయల ఆస్తి పన్ను వస్తుందంటే పంచాయతీ సామర్థ్యం ఎంతగా ఉందో అర్థమవుతుంది. కార్యదర్శుల అవినీతి భాగోతం తర్వాత పన్ను చెల్లించడానికి ప్రజలు ఎదురుతిరుగుతున్నారు. సొంతంగా సొమ్ములు తినేయడానికా పన్ను చెల్లించాలంటూ ప్రశ్నిస్తున్నారు. రాయలం పంచాయతీలో పన్ను వసూలు చేయడం ఇప్పటి సిబ్బందికి సవాల్‌గా మారింది. పంచాయతీలో గత రికార్డులన్నీ జిల్లా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తు పూర్తి చేశారు.



సంక్రాంతికి చుట్టేద్దాం!

» సొంతూళ్లకు భారీగా వచ్చేస్తున్న ప్రయాణికులు » ఆర్టీసీ రెగ్యులర్‌తో పాటు ప్రత్యేక సర్వీసులు ఫుల్

భీమవరం టౌన్, డిసెంబరు 22(ఆంధ్ర జ్యోతి) : ఈ సంక్రాంతికి హైదరాబాద్ నుంచి జిల్లాకు చుట్టాలు భారీగానే తరలి వస్తున్నారు. ఈ సారి సెలవులు వరుసగా రావటంతో ముందస్తుగానే ప్రయాణాలకు ఏర్పాటు చేసుకుంటున్నారు. దానికి తగ్గటుగానే రిజర్వేషన్‌లు పూర్తిచేసుకుని స్థిమిత పడుతున్నారు. ఇందులో భాగంగా వచ్చేనెల 9నుంచి 13వ తేదీ వరకు ఆర్టీసి జిల్లా నుంచి 113 సర్వీసులను నడపాలని నిర్ణయించి ఆమేరకు సర్వీసులను ఏర్పాటు చేసింది. రెగ్యులర్‌గా భీమవరం డిపో నుంచి 2, తాడేపల్లిగూడెం డిపో నుంచి 4, నరసాపురం డిపో నుంచి 3, తణుకు డిపో నుంచి 3 సర్వీసులు నడుపుతున్నారు. నెల కిందటే రెగ్యులర్ సర్వీసులకు రిజర్వేషన్ పూర్తి కావటంతో ప్రయాణికులు ప్రైవేట్ వైపు చూడకుండా ముందు జాగ్రత్తగా ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేసి జిల్లాలోని భీమవరం, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం డిపోలకు సంబంధించి ఏ రోజు ఎన్ని సర్వీసులు నడపాలనే లక్ష్యాలను ఇటీవల జిల్లా అధికారులు నిర్ణయించి ప్రణాళికను సిద్ధం చేశారు. రిజర్వేషన్ చార్టు పరిశీలన చేస్తే దాదాపు 113 సర్వీసులకు రిజర్వేషన్ దాదాపు పూర్తి అయ్యే పరిస్థితి వచ్చింది. దీంతో అధికారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముందుగానే ప్రణాళికాబద్ధంగా వ్యవహరించటంతో అనుకున్న లక్ష్యం చేరుకోగలిగామని చెబుతున్నారు. ప్రస్తుతం రిజర్వేషన్ పక్రియను పరిశీలిస్తే 9నుంచి 12 తేదీ వరకు భీమవరం డిపో నుంచి 40, నరసాపురం నుంచి 24, తాడేపల్లిగూడెం డిపో నుంచి 20, తణుకు డిపో నుంచి 28 సర్వీసులు రిజర్వేషన్‌లకు ఓపెన్‌చేశారు. ఇవికూడా దాదాపు రిజర్వేషన్ పూర్తి అయ్యేలా కనిపిస్తున్నాయి.

అవసరమైతే మరికొన్ని సర్వీసులు

ప్రజా రవాణాధికారి వరప్రసాద్

సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకుని ముందస్తుగానే సర్వీసులు ఏర్పాటు చేశాం. ముఖ్యంగా రాజమండ్రి, అమలాపురం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసాపురం, తణుకు ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణికుల కోసం సర్వీసులను ఏర్పాటు చేసే ఆలోచన చేశాం. పండుగ సెలవులు కాబట్టి విద్యార్థులకోసం ఏర్పాటు చేసిన బడి బస్సులను సిద్ధంగా ఉంచుతాం. అదే విధంగా కొన్ని బస్సులను పూర్తిస్థాయిలో కండీషన్‌లమెరుగు పరిచేందుకు మరమ్మతులను చేయిస్తున్నాం. అదే విధంగా జిల్లాకు ఏడు కొత్త బస్సులు వచ్చాయి. వాటిని కూడా డిపోల వారీగా సీజన్‌కు సిద్ధం చేసేలా ప్రయత్నాలు ప్రారంభించాం. హైదరాబాద్ నుంచి వచ్చే రద్దీ ఈసారి సంతృప్తికరంగా ఉంది. ఇప్పటికే రిజర్వేషన్‌లు పూర్తి కావస్తున్న నేపథ్యంలో అవసరమైతే మరి కొన్ని సర్వీసులను ఏర్పాటు చేస్తాం.

మూడు పేర్లు.. ముగ్గురు భార్యలు

» నిందితుడిగా అనుమానిస్తున్న శ్రీధర్‌వర్మను సూత్రధారిగా తేల్చిన పోలీసులు
» యండగండి మృతదేహం పార్శిల్ కేసులో పురోగతి
» ఇంతకీ మృతదేహం ఎవరిది?
» హత్య చేసి మృతదేహాన్ని తెచ్చారా..

- వివరాలు మెయిన్



మృతదేహం పార్శిల్ వచ్చిన ఇల్లు ఇదే

ఛ్ఛ ...టీడీపీ సభ్యత్వంలో దూకుడేది

» మూడు నియోజకవర్గాల్లో వెనుకంజ
» పార్టీ శ్రేణుల్లో అసంతృప్తే కారణమా
» అధిష్ఠానం హామీలు నెరవేరడం లేదంటూ ఆవేదన



భీమవరం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం సభ్య త్వ నమోదులో పాలకొల్లు నియో జకవర్గం రాష్ట్ర స్థాయిలోనే రికార్డు సొంతం చేసుకుంటోంది. ఆ తర్వా త స్థానంలో ఉండి నియోకవర్గం ఉంది. సభ్యత్వాన్ని తీసుకున్న వారికి బీమాను వర్తింప జేస్తు న్నారు. అయినా సరే జిల్లాలో మూడు నియోజకవర్గాలు సభ్యత్వ నమోదులో ఇబ్బందులు పడుతు న్నాయి. పార్టీ శ్రేణులు అంతగా స్పందించడం లేదు. అసంతృప్తి గూడు కట్టుకొంది. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి శ్రేణుల్లో సంతృప్తిగా లేవు. అధిష్ఠానం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదంటూ ఒకింత ఆవేదన నెలకొంది. ఎన్నికల ముందు పార్టీ కార్యక్రమాలు, సభ్యత్వనమోదులోనూ ఎ గ్రేడ్‌లో ఉన్న నియోజకవర్గాలు పార్టీ పరంగా ఇప్పుడు డీలా పడుతున్నాయి. దీనిపై అధిష్ఠానం కూడా ఆరా తీసింది. ఎందుకు సభ్యత్వ నమోదు కావడం లేదంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తోంది. నియోజకవర్గ నాయకత్వం ఏ సమాధనం చెప్పాలో తెలియక తికమక పడుతున్నారు. సభ్యత్వ నమోదుకు పార్టీ శ్రేణుల వెంట పడుతున్నారు. తెలుగుదేశం సభ్యత్వ నమోదు కోసం రూ. 100 రుసుము పెట్టారు. బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. అయినా సరే పార్టీ శ్రేణుల నుంచి సహాయ నిరాకరణ ఎదురవుతోంది. ముఖ్యంగా తాడేపల్లిగూడెం, భీమవరం, నరసాపురం నియోజకవర్గాలు సభ్యత్వ నమోదులో వెనుకంజలో ఉన్నాయి. ఎన్నికల ముందు ఈ మూడు నియోజకవర్గాల్లోనూ నేతలకు చంద్రబాబు హామీలు ఇచ్చారు. పొత్తుల్లో జనసేనకు కేటాయించారు. టిక్కెట్ ఇస్తామంటూ తొలి నుంచీ భరోసా ఇచ్చి పొత్తులో కేటాయించలేకపోవడంతో నాయకులను పిలిపించి చంద్రబాబు బుజ్జగించారు. గట్టి హామీలను ఇచ్చారు. జిల్లాలో తాడేపల్లిగూడెం నియోకవర్గం ముందు వరుసలో ఉంది. నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జికి టిక్కెట్ ఇస్తామంటూ భరోసా ఇచ్చారు. పొత్తులో జనసేనకు ఇచ్చారు. ఈ క్రమంలో బాబ్జితో చంద్రబాబు సంప్రదింపులు జరిపారు. రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవితో పాటు, ఆ తర్వాత ఎమ్మెల్సీ ఇస్తామంటూ హామీ ఇచ్చారు. అలాగే నర్సాపురంలో ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, మాజీ ఎమ్మెల్యే మాధవనాయుడులు జనసేన అభ్యర్థిని గెలిపించాలని, ఎన్నికల తర్వాత అంతా చూసుకుంటామని భరోసా కల్పించారు. ఉండి నియోజకవర్గంలో రామరాజుకు టిక్కెట్‌ను మార్పు చేయాల్సి రావడంతో ఎన్నికల ముందే జిల్లా అధ్యక్షునిగా నియమించారు. అప్పటివరకు అధ్యక్షురాలిగా వ్యవహరించిన తోట సీతారామలక్ష్మిని పొలిట్ బ్యూరోలో స్థానం కల్పించారు. ఎన్నికల అనంతరం రామరాజుకు ఏపీఐఐసీ ఛైర్మన్‌గా నియమించారు. పార్టీ న్యాయం చేసిన నియోజకవర్గాల్లో సభ్యత్వ నమోదు దూకుడుగా సాగుతోంది. ఇతర నియోజకవర్గాల్లో మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. అధిష్ఠానం ఇచ్చిన లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు.

సభ్యత్వ నమోదు ఇలా

నియోజకవర్గం	ఓటర్లు	సభ్యత్వం
పాలకొల్లు	193888	120844
ఉండి	222259	88324
తణుకు	231675	54223
ఆచంట	178100	40449
భీమవరం	248856	35834
తాడేపల్లిగూడెం	210991	34448
నర్సాపురం	167954	28986

అసంతృప్తి చల్లారేనా

రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవుల్లోనూ అన్యాయం జరిగిందంటూ తాడేపల్లిగూడెం, నర్సాపురం వంటి నియోజకవర్గాల్లోని తెలుగుదేశం కేడర్‌లో ఒకింత అసంతృప్తి రాజ్యమేలుతోంది. నియోజకవర్గ ఇన్‌చార్జిలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు. డైరెక్టర్ పదవుల్లోనూ తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి ప్రాధాన్యం దక్కలేదు. ఆర్యవైశ్య కార్పొరేషన్‌లో మాత్రమే డైరెక్టర్ పదవి వరించింది. అంతకు మించి తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో డైరెక్టర్ పదవులు రాలేదు. ఇన్‌చార్జికు ఇచ్చిన హామీలుకూడా నెరవేరే అవకాశం లేదంటూ కేడర్ ఇప్పుడు అసంతృప్తి ఉంది. నర్సాపురంలోనూ అదే పరిస్థితి. కూటమి అధికారంలో ఉన్నా సరే ఇన్‌చార్జి నోరు మెదపలేని పరిస్థితి. భీమవరం నియోజకవర్గంలోనూ తెలుగుదేశం నుంచి నామినేటెడ్ పదవులు ఆశించిన వారున్నారు. ఈ ప్రభావం సభ్యత్వ నమోదుపై పడుతున్నట్టు కనిపిస్తోంది. అధికారంలోకి రావడంతో తెలుగుదేశం పార్టీ లక్ష్యాన్ని పెంచింది. ఓటర్ల సంఖ్యలో 25 శాతం సభ్యత్వ నమోదు చేయాలంటూ నియోజకవర్గ బాధ్యులకు అధిష్ఠానం దిశానిర్దేశం చేసింది. గత ఏడాది కంటే అధికంగానే అవుతున్నాయి. కానీ అధిష్ఠానం ఇచ్చే లక్ష్యాన్ని చేరుకోవడంలో జిల్లాలోని మూడు నియోజకవర్గాలు వెనుకపడుతున్నాయి.

వెరీ గుడ్డు



» భారీగా పెరిగిన ధర » హోల్ సేల్‌లో రూ.5.50
» రిటైల్‌గా రూ.7.0 » పెరిగి తగ్గుతున్న గుడ్డు ధర

తణుకు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కోడి గుడ్డు ధరలు పెరిగినట్టు పెరిగి తగ్గుతూ వస్తున్నాయి. నాలుగు రోజులు నుంచి రోజు పది, ఇరవై పైసలు చొప్పున తగ్గుతున్నది. మూడు రోజులు క్రితం 6.50 రూపాయలు నుంచి ఇపుడు 5.50 రూపాయలకు పడిపోయింది. మూడు రోజుల్లోనే రూపాయి పడిపోయింది. చలి కాలంలో కూడా ఆశించిన స్థాయిలో ధరలు లేకపోవడంతో పౌల్ట్రీ పరిశ్రమ వర్గాలు కాస్త ఆందోళన చెందుతున్నాయి. అయితే ఇప్పటి వరకు వరుస నష్టాలు చవిచూస్తున్న రైతులు ఇపుడు కాస్త పెరిగిన గుడ్డు ధరలతో ఉపశమనం లభించింది. రైతులు వద్ద ధరలకు బహిరంగ మార్కెట్లో ధరలకు ఏమాత్రం పొంతన ఉండదు. ప్రస్తుతం రిటైల్ మార్కెట్‌లో గుడ్డు 7 రూపాయలకు విక్రయిస్తున్నారు. ఇప్పటి వరకు ఎండలు వల్ల తీవ్ర ఇబ్బందులు పడిన రైతులకు ఇపుడు కోలుకునే పరిస్థితి వచ్చింది. వేసవి కాలంలో గుడ్లు దిగుబడి తగ్గడంతో పాటు, కోళ్ళు చనిపోవడం వల్ల పౌల్ట్రీ రైతులు తీవ్ర నష్టాలు పాలయ్యారు. ప్రస్తుతం వర్షాలు పడటంతో వాతావరణం చల్లబడటం వల్ల కోళ్ళు మేతతినడం ద్వారా ఉత్పత్తి కూడా పెరిగింది. దానికి తోడు గుడ్డు ధర పెరగడం వల్ల రైతులకు లభించింది. రానున్న క్రిస్‌మస్, సంక్రాంతి పండుగలు నేపథ్యంలో ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. క్రిస్‌మస్‌లకు కేక్‌లు తయారీలో గుడ్డులు వినియోగం బాగా ఉంటుంది. అలాగే భోజనాల్లో కూడా చికెన్ వివియోగం ఉంటుంది. దీంతో ధరలు పెరుగుతాయనే ఆశతో రైతులు చూస్తున్నారు.

పెరిగిన ఉత్పత్తి

శీతాకాలం కావడంతో గుడ్ల ఉత్పత్తి బాగా పెరిగింది. వేసవి కాలం తర్వాత ఈస్థాయిలో ఉత్పత్తి రావడం రైతులకు ఆనందం కలుగుతుంది. వేసవిలో ఎండ వేడికి తట్టుకోలేక చాలా ఇబ్బందులు ఎదుర్కొన్న దాఖలాలు ఉన్నాయి. ప్రస్తుతం అలాంటి ఇబ్బందులు నుంచి ఉపశమనం లభించింది. జిల్లాలో కోటి 30లక్షల కోళ్ళు ఉన్నాయి. వాటిలో కోటి కోళ్ళు మాత్రమే గుడ్లు పెడతాయి. గత వేసవిలో పోల్చితే ఉత్పత్తి బాగా పెరిగింది. గతంలో కేవలం70నుంచి 75లక్షలు ఉత్పత్తి వస్తే ఇపుడు కోటి వరకు పెరిగింది. దీంతో రైతులు ఇప్పటి వరకు నష్టాలను చవిచూసిన వారికి ఖర్చులు పోను రుణాలు తీర్చుకునే వెసులుబాటు కలిగింది.

పెరిగిన ఎగుమతులు

గుడ్లు ఉత్పత్తికి అనుగుణంగా ఎగుమతులు కూడా బాగానే ఉన్నాయి. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల నుంచి 30 లారీలు వరకు ఎగుమతి అవుతుంటాయి. ప్రదానంగా ఈశాన్య రాష్ట్రాలైన బీహార్, పశ్చిమబెంగాల్, ఒడిశ్సా, మహారాష్ట్ర వంటి ప్రాంతాలకు ఎగుమతులు అవుతుంటాయి. ఉత్పత్తి అయిన గుడ్లలో 60శాతం ఎగుమతులు పోగా మిగిలిన 40శాతం స్థానికంగా విక్రయాలు జరుగుతుంటాయి. స్థానికంగా ప్రభుత్వం అంగన్‌వాడీలు, మధ్యాహ్న బోజన పథకంతో పాటు స్థాక ప్రజలు కొనుగోలు చేయడం జరుగుతుంది.

జ్యూవెలరీ షాపు సీజ్

» అంతటా తనిఖీలు » పెరుగుతున్న బాధితులు
» ఆరు కేజీల బంగారం, వంద కేజీల వెండి రికవరీ
» తాడేపల్లిగూడెంలో బంగారం వ్యాపారులు, ఖాతాదారులకు కుచ్చు టోపీ

◆ 7లో..

వాష్ రూమ్‌లో ఫొటోలు తీసిన ఆకతాయిలు



వేంకటేశ్వరస్వామి వారికి తులసి ఆకులు సమర్పిస్తున్న అర్చకులు

కాళ్ళకూరు వెంకన్నకు లక్ష తులసిపూజ



ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవార్లు

కాళ్ళ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి అమ్మవార్లకు లక్ష తులసి పూజ ఆదివారం నిర్వహించారు. ధనుర్మాసం పవిత్ర సప్తమి పర్వదినం పురస్కరించుకుని ఉదయం లక్ష తులసి పూజ, మధ్యాహ్నం అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన, సాయంత్రం సుగంధ పరిమళ పుష్పాలతో అష్టోత్తర శతనామార్చన, సహస్ర దీపాలంకరణ సేవ, నీరాజన మంత్ర పుష్పములు దేవస్థానం ఆస్థాన వేద పండితులు అనిపెద్ది ఫణికుమార్ వర్మ, అర్చకులు వేదోక్తంగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం అఖండ అన్నసమారాధన జరిపారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం ఈవో ఎం.అరుణ్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లక్ష్మీనరసింహుడికి రూ.6లక్షల వాహనం వితరణ



దాత అందించిన గరుడ వాహనం

ద్వారకాతిరుమల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఐఎస్ జగన్నాథపురం శ్రీలక్ష్మీనారసింహునికి సుమారు రూ.6 లక్షలు విలువైన వాహనాలను దాత అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన కొచ్చర్లకోట సత్యవెంకట లక్ష్మీనరసింహ వాహనాలను స్వామి వారి సేవలకు వినియోగించాలని కోరారు. ఆలయ అర్చకులు ముందుగా వాటి వద్ద ఆలయంలో గణపతిపూజ, పుణ్యాహవచనం, పర్యగ్నికరణం, వాస్తుహోమం పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం పూజలు చేసి శ్రీకనకవల్లీ సమేత లక్ష్మీనారసింహుని ఉత్సవ విగ్రహాలను ఉంచి శోభాయమానంగా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణలో కోవెల ఉత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ఈవో సత్యనారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. ధనుర్మాస ఉత్సవం



గోదాదేవితో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

ద్వారకాతిరుమల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి ధనుర్మాస ఉత్సవం ఆదివారం క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా జరిగింది. ఇందులో భాగంగా స్వామివారు, ఉభయ దేవేరులు, గోదాదేవితో కలసి అట్టహాసంగా ఊరేగారు. ముందుగా ఆలయ ఆవరణలో తొళక్క వాహనంపై శ్రీవారు, అమ్మవార్లతో పాటు గోదాదేవి ఉత్సవమూర్తులను ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకరణ చేసారు. అనంతరం గజ, అశ్వ సేవలతో పాటు మేళతాళాలు, డోలు సన్నాయి వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ధనుర్మాస మండపంలో గోదాదేవితో సహా శ్రీవారి, అమ్మవార్లను ఉంచి ప్రత్యేక పూజలు జరిపి, హారతులిచ్చి ప్రసాదవితరణ చేశారు.

ఉద్యాన వర్సిటీ వీసీకి బెంగళూరు సంస్థ అవార్డు



బెంగళూరులో అవార్డు అందుకున్న వీసీ గోపాల్

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వెంకట్రామన్నగూడెం వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉప కులపతి బి.గోపాల్ మొక్కల రక్షణపై అవార్డు అందుకున్నారు. బెంగళూరుకు చెందిన ఎన్‌సెక్ట్ ఎన్విరాన్‌మెంట్ సంస్థ ఉత్తమ మొక్కల రక్షణ అవార్డు ప్రకటించింది. బెంగళూరులో ఈనెల 21న నిర్వహించిన అబ్రహం వర్గీస్ ఇన్‌సెక్ట్, నేచర్ ట్రస్ట్ అవార్డు వేడుకలో ఆయనకు అవార్డు అందించారు. ఉపకులపతి గోపాల్ తీపి నారింజ, పులుపు నిమ్మ, ఉల్లి, పసుపు సుగంధ ద్రవ్యాల అభివృద్ధిలో అందించిన సేవలకు ఈ అవార్డు అందించారు. వీసీ గోపాల్‌ను వర్సిటి అధికారులు, అధ్యాపకులు అభినందించారు.



నరసాపురంలో విద్యుత్ కాంతుల్లో చర్చి



మునునూరులో చిన్నారుల సందడి

క్రిస్మస్ వెలుగులు

నరసాపురం టౌన్, మునునూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల క్రిస్మస్ సందడి నెలకొంది. పట్టణ, గ్రామాల్లో పలు ప్రార్థన మందిరాలను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలకరించారు. నరసాపురంలో ప్రసిద్ధిగాంచిన లూథరన్, బెతెస్థ, జీడీఎం, పెంతికోస్తు, టీటీసీ సంఘాలతో పాటు మండలంలోని సరిపల్లి, మల్లవరం, లిఖితపూడి, చిట్టవరం, లక్ష్మణేశ్వరం, ఎల్‌బిచర్ల, సీతారాంపురం, పసలదీవి, కొత్త నవరసపురం గ్రామాల్లోని పలు చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రార్థనలు అనంతరం ప్రేమ విందులు నిర్వహిస్తున్నారు. మార్కెట్ కళకళలాడింది. బట్టల దుకాణాలు, స్వీట్ షాపు, బేకరీ వ్యాపారులు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించారు. మునునూరులో బెరాకా ప్రార్థన మందిరంలో చిన్నారులు సందడి చేశారు.



దేశానికి అన్నం పెట్టే రైతన్న పరిస్థితి నేడు అత్యంత దయనీయంగా మారింది. దేశాన్ని రక్షించే జవానులు, ప్రజలకు అన్నంపెట్టే రైతులను ఉటంకిస్తూ జై జవాన్.. జైకిసాన్ నినాదం రైతుల విషయంలో సంతోషదాయకంగా మాత్రమే మిగిలింది. రైతులకు ప్రభుత్వాలు వెన్నుదన్నుగా నిలవలేకపోతున్నాయి. జమిందారి చట్టం రద్దు కౌలు దారీ చట్టం అమలు సమగ్ర సాగునీటి ప్రాజెక్టులు వంటివాటికి రూపకల్పన చేసి రైతు బంధుగా పేరుగాంచిన మాజీ ప్రధాని చరణ్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని 2001 నుంచి డిసెంబరు 23 జాతీయ రైతు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. రైతు సమస్యలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

ఆరుగాలం శ్రమ

• నేడు రైతు దినోత్సవం



ఆదాయం భ్రమ

• ప్రకృతికి ఎదురీదుతున్న రైతు • అతివృష్టి, అనావృష్టితో కష్టాలు
• ప్రభుత్వం మరింత చేయూతనివ్వాలి • గిట్టుబాటు ఉండాలి
• రైతులకు పింఛన్ ఇవ్వాలి

గుర్తింపు లేదు..!

జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒక టీమ్ ఏర్పాటు చేసి రైతులకు క్షేత్రస్థాయిలో సూచనలు సలహాలు ఇవ్వడం. సాంకేతిక అంశాలను తెలియజేయడం, వ్యవసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉండడం ద్వారా రైతులకు మేలు కలుగుతుందని పరిశీలకులు భావిస్తున్నారు. 2001 నుంచి ఏటా డిసెంబరు 23న జాతీయ రైతు దినోత్సవం నిర్వహిస్తున్నప్పటికి క్షేత్రస్థాయిలో గ్రామాలు, మండలాల వారీగా ఆదర్శ రైతులను గుర్తించి గౌరవించడం, కనీసం ప్రత్యేక సందర్భంలోనైనా రైతులను ప్రోత్సహించే విధంగా చర్యలు లేకపోవడంపై విమర్శలు వినబడుతున్నాయి.

నేడు ప్రతి సందర్భానికి దినోత్సవం నిర్వహించి ఆర్భాటం చేస్తున్నారు. ప్రేమికుల దినోత్సవం, వృద్ధుల దినోత్సవం, తల్లులు దినోత్సవం, తండ్రుల దినోత్సవం, పురుషుల దినోత్సవం ఏడాదిలో 365 రోజులకు సరిపడా దినోత్సవాలు నిర్వహిస్తున్నప్పటికి రైతు దినోత్సవం ప్రజలలోనికి తీసుకెళ్లడానికి జిల్లా స్థాయి అధికారులు స్పందించి రైతులకు వెన్నుదన్నుగా నిలవాలని పలువురు కోరుతున్నారు.

పాలకొల్లు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వరితోపాటు వాణిజ్య పంటలు పండించే రైతులు పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. ప్రకృతి వైపరీత్యాలతో ఎదురీదుతున్న రైతులు ఆరుగాలం శ్రమించినా ఆదాయం భ్రమగానే మిగులుతున్నది. వ్యవసాయం జూదంగానే మరిందని చెప్పవచ్చు. వర్షాకాలం, శీతాకాలం, వేసవి కాలంతో నిమిత్తం లేకుండా తుఫానులు చుట్టుముట్టేస్తున్నాయి. పంట చేతికొచ్చే సమయానికి ప్రకృతి కన్నెరైచేస్తుంది. దీంతో అప్పులు బాదలు పడలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

కౌలు రైతు పరిస్థితి దుర్భరం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 80 శాతం పైబడి కౌలు రైతులే ఉన్నారు. సామాన్య మధ్య తరగతి రైతులు సైతం సాగు చెయ్యలేక ఇంటిల్లి పాది వ్యవసాయ పనులు చేసుకునే రైతులకు తమ పొలాలను కౌలుకు ఇస్తున్నారు. భూమిపై కౌలు రైతులకు పూర్తి హక్కులేకపోవడంతో ప్రభుత్వపరంగా రుణాలు అందక అధిక వడ్డీలకు అప్పులు తెస్తున్నారు. పంట దక్కకపోతే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కౌలుదారీ చట్టాలతో కౌలు రైతులకు మేలు జరగకపోవడంతో వారి పరిస్థితి దుర్భరంగా మారింది.

వ్యవసాయానికి యువత దూరం

వ్యవసాయం చెయ్యడానికి యువత ఆసక్తి చూపించడం లేదు. జిల్లాలో 90 శాతం రైతులు 40 ఏళ్ల పైబడినవారే. ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు మెరుగుపడడంతో యువత వ్యవసాయంపై మక్కువ చూపించడం లేదు. దీంతో భవిష్యత్ తరంలో సాగు ఉనికికే ప్రమాదం ఏర్పడే పరిస్థితి ఉంది. యువతకు ప్రోత్సాహకాలు ఇవ్వడానికి ప్రభుత్వాలు ముందుకు వస్తే యువ రైతులు పెరిగే అవకాశం ఉంది.

గిట్టుబాటు ధర లేదు

రైతులు పండించే వివిధ పంటలతో పాటు వాణిజ్య పంటలకు గిట్టు బాటు ధర ఇవ్వాల్సిన పరిస్థితి ఉంది. ప్రముఖ హీరో నటించిన సినిమా విడుదలైతే ఇష్టానుసారం టిక్కెట్ ధరలు పెంచుకోడానికి అనుమతిస్తున్న ప్రభుత్వాలు రైతు పండించిన పంట నష్టం లేకుండా అమ్ముకోవడానికి అనుమతివ్వాలని కోరుతున్నారు. రైతులకు వెన్నదన్నుగా నిలవాల్సిన ప్రభుత్వాలే మొండి చెయ్యి చూపిస్తున్నాయి. రెండు దశాబ్దాల ధరలు పరిశీలిస్తే సాగు వ్యయం 200 శాతం పెరగగా పంట ఉత్పత్తులు పెరిగింది 50 శాతం మాత్రమే.

రైతులకు పింఛన్ ఇవ్వాలి

పదవీ విరమణ చేసిన ప్రభుత్వోద్యోగులకు పింఛను ఇచ్చిన మాదిరి 60 ఏళ్ల పైబడిన రైతులకు పింఛన్ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. సాగు చేస్తున్న రైతులకు ప్రోత్సాహం అంతంత మాత్రమే. వృద్ధాప్యంతో సాగుకు దూరమైన రైతుకు అసలు ప్రోత్సాహమే లేదు. సంక్షేమానికి పెద్దపీట వెయ్యడం ద్వారానే వ్యవసాయం మనగలుగుతుందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.



యువ రైతులను ప్రోత్సహించాలి

వ్యవసాయం చేసేవారిలో 40 ఏళ్ల వయసు పైబడిన వారే అధికం. యువత 10శాతం కూడా లేరు. యువ రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాలి. వ్యవసాయ కార్మికులు తగ్గుతున్నందున రాయితీపై వ్యవసాయ యంత్రాలను అందించాలి. వాణిజ్య పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలి. వాణిజ్య ఉత్పత్తులను నిల్వ చేసేందుకు శీతల గిడ్డంగులు నిర్మించాలి.

- తాళ్లూరి శ్రీనివాస్, రైతు, శివదేవునిచిక్కాల



పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలి

కొత్త సినిమా టిక్కెట్లు ఇష్టమొచ్చిన ధరకు అమ్ముకోడానికి ప్రభుత్వాలు అనుమతిస్తున్నాయి. రైతు పంట గిట్టుబాటు ధరకు అమ్ముకునే అనుమతి లేదు. రానున్న రోజుల్లో రైతులు కనుమరుగయ్యే పరిస్థితులున్నాయి. రైతు శ్రేయస్సుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేయాలి. దేశానికి రైతే వెన్నుముక, ప్రభుత్వాలు రైతుకు వెన్నుదన్నుగా నిలవాలి.

- మండెల నాని, రైతు, గోరింటాడ



సన్నిహితురాలి ఇంట్లోనే చోరీ

18 కాసుల బంగారం.. రూ.1.5 లక్షల నగదు స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితుడు, వివరాలు వెల్లడిస్తున్న సీఐ కాళీచరణ్

భీమవరం క్రైం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్, జూదం, వ్యసనాలకు అలవాటు పడిన వ్యక్తి తన సన్నిహితురాలి ఇంట్లోనే బంగారం, నగదు అపహరించి పోలీసులకు పట్టుబడ్డాడు. భీమవరం టూటౌన్ సీఐ కాళీచరణ్ ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. భీమవరం మండలం ఎల్‌విఎన్ పురం గ్రామానికి చెందిన వీరవల్లి కృష్ణమోహన్‌కు భీమవరం బలుసుమూడికి చెందిన పాతర్లపల్లి మాలతితో కొంత కాలం క్రితం పరిచయం ఏర్పడింది. మాలతి భర్తకు దూరంగా ఉంటూ సున్నం అంజనేయులు అపార్ట్‌మెంట్ ఏజి-4లో నివాసం ఉంటుంది. వారిద్దరి మధ్య సన్నిహితం ఏర్పడింది. ఇదిలా ఉండగా వ్యసనాలకు బానిస అయిన కృష్ణమోహన్ దొంగతనం చేయాలని నిర్ధారించుకున్నాడు. మాలతి జూన్ 1న ఇంటికి తాళాలు వేసి హైదరాబాద్ వెళ్లారు. అది గమనించిన కృష్ణమోహన్ అదే నెల 4న మాలతి ఇంటి తాళాలు పగులగొట్టి 18 కాసుల బంగారు ఆభరణాలు, రూ.1.5లక్షల నగదు అపహరించాడు. బీరువాలో బట్టలు చిందరగా పడవేసి ఇంట్లో కారం చల్లి దొంగలు దొంగతనం చేసినట్లు చేసి వెళ్ళిపోయాడు. హైదరాబాద్ నుంచి వచ్చిన మాలతి ఇంట్లో దొంగలు పడ్డారని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కృష్ణమోహన్ మాత్రం ఏమీ తెలియనట్లుగా మాలతి వద్దకు వెళ్ళి ఓదార్చేవాడు. దొంగిలించిన సొమ్మును అవసరాలకు వాడుకుని బంగారాన్ని విక్రయించడానికి ఈ నెల 21న పాత బస్టాండ్ వద్ద తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని బంగారాన్ని స్వాధీనం చేసుకుని అతడిని అరెస్ట్ చేశారు. కేసును ఛేదించడానికి జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మి డీఎస్‌పి జయసూర్య ఆధ్వర్యంలో సీఐ కాళీచరణ్, ఎస్‌ఐ రెహ్మాన్, ఏఎస్‌ఐ వర్మ, హెచ్‌సి గోవిందరాజులు, సిబ్బంది గోపి, నరేష్ కృషి చేశారు. అధికారులు అభినందించి నగదు బహుమతులను ప్రకటించారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ రెహ్మాన్, ఏఎస్‌ఐలు వర్మ, స్వామి, సిబ్బంది నరేష్, గోపి, గోవిందరాజు తదితరులు ఉన్నారు.

పార్శిల్ మృతదేహం సమాచారం తెలిస్తే చెప్పండి



ఉండి మండలం యండగండికి పార్సిల్‌లో వచ్చిన మృతదేహం

• ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి

భీమవరం క్రైం / ఉండి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉండి మండలం యండగండిలో ముదునూరి రంగరాజు ఇంటికి ఈ నెల 19న చెక్క పెట్టెలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పార్శిల్ వచ్చింది. మృతదేహం ఆనవాళ్లు ఎస్పీ నయీమ్ అస్మి, ఉండి ఎస్ఐ నజీరుల్లా ఆదివారం వెల్లడించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మృతుడి వయసు సుమారు 30 నుంచి 40 ఏళ్లు ఉండవచ్చు, ఎత్తు 5.8 అడుగులు, పొడుగు చేతుల నలుపు రంగు స్వెట్టర్, సగం చేతుల ఆకుపచ్చ రంగు టీషర్ట్, షర్ట్ ముందు భాగంలో 'బ్రాను ఓరియెంటల్ అర్‌మోర్' అనే ఇంగ్లిష్ అక్షరాలు ఉన్నాయి. నలుపు రంగు కట్ చేసిన ప్యాంటు కలదు. పురుషుడి మృతదేహం కుళ్లిన స్థితిలో ఉన్నది. సుమారు ఈ నెల 16/ 17 తేదీల్లో చనిపోయి ఉండవచ్చు అని పోలీసులు భావిస్తున్నారు. ఈ నెలలో 30 నుంచి 40 ఏళ్ల వయస్సు వారు కనబడకుంటే ఉండి, ఆకివీడు, భీమవరం పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. 9154966497, 9440796648, 9154966508 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు అధికారులు కోరారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ఇద్దరిని రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 270గ్రాములు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై ప్రసాద్ ఆదివారం తెలిపారు. మండలంలోని పెదతాడేపల్లి జాతీయ రహదారి సమీపంలో తాడేపల్లిగూడెంకు చెందిన హర్షవర్దన్, మణికంఠ గంజాయితో ఉన్నట్టు సమాచారం రావడంతో అక్కడ నిఘా పెట్టగా హర్షవర్ధన్, మణికంఠల వద్ద మంజాయి స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. ఈ మేరకు కేసు నమోదుచేసినట్టు తెలిపారు. గంజాయి రవాణా, విక్రయాలపై నిఘా ఉంచామని, వినియోగిస్తున్న వారి సమాచారం తెలిసిన వారు పోలీసుకు తెలియజేయాలని ఎస్సై సూచించారు.

విద్యార్థిని ప్రసవం ఘటనలో ఇద్దరి అరెస్ట్

ఏలూరు క్రైం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మిషనరీ కాన్వెంట్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్న ఒక విద్యార్థిని (నన్) మగ్గ బిడ్డను ప్రసవించడం, బిడ్డ మరణించిన సంఘటనలో ఇద్దరిని వ్యక్తులను ఏలూరు డీఎస్పీ డీ శ్రావణ్ కుమార్ అరెస్టు చేశారు. అశోక్‌నగర్‌లోని సెయింట్ జోసఫ్ కాన్వెంట్‌లో చదువుకుంటున్న ఒక విద్యార్థిని (16) ఈనెల 8న తెల్లవారుజామున మగ బిడ్డను ప్రసవించింది. ఆ బిడ్డను మూడో అంతస్తు నుంచి కిందికి పడవేశారు. మరణించిన తరువాత పడేశారా, పడేసిన తరువాత మరణించిందా అనే విషయాలు పోస్టుమార్టం నివేదికలో వెల్లడి కావాల్సి ఉంది. అక్కడికి ట్యూషన్ చెప్పడానికి వచ్చే ఒక బ్రదర్ (పాస్టర్‌గా శిక్షణ పొందుతున్న వ్యక్తి) ఆ బాలికను లోబరుచుకుని గర్భవతిని చేశాడనే ఆరోపణలు ఉన్నాయి. అయితే పోలీసులు ఈ కేసులో దర్యాప్తు చేసి ఆ సమీపంలోనే ఎదురుగా ఉన్న బాష్యం స్కూలు ఆఫీసర్ బాయ్, దెందులూరు మండలం అక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన జుజ్జూరి అఖిల్ (24)ను అరెస్టు చేశారు. అతడు కూడా ఆ విద్యార్థినిని లోబర్చుకుని అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. నంద్యాల జిల్లా చాపిరేవుల గ్రామానికి చెందిన దండు రాజీవ్ (30) ఏలూరులో బ్రదర్‌గా శిక్షణ పొందుతూ ట్యూషన్ చెప్పడానికి సెయింట్ జోసఫ్ కాన్వెంట్‌కు వచ్చేవారు. ఇతను కూడా ఆ విద్యార్థినిని లోబర్చుకుని అత్యాచారానికి పాల్పడ్డాడనే అభియోగంతో 21న ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ అరెస్టు చేశారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

క్రైమ్ కార్నర్

నగల దుకాణం సీజ్

- తాడేపల్లిగూడెంలో తనిఖీలు
- పెరుగుతున్న బాధితులు
- ఆరు కేజీల బంగారం, వంద కేజీల వెండి రికవరీ

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలో హోల్‌సేల్ బంగారు వ్యాపారులకు, ఖాతాదారులకు కుచ్చుటోపి వేసిన మాన్సీ జ్యూయలర్స్‌ను పోలీసులు ఆదివారం సీజ్ చేశారు. ఇప్పటికే వ్యాపారి లంకా రమణబాబు చాలామంది దగ్గర సొమ్ములు, వజ్రాల ఆభరణాలు, వెండి ఆభరణాలు తీసుకుని కనిపించకుండా పోలీసులు నిర్ధారించారు. గాలింపు చర్యలు చేపట్టారు. పట్టణంలోని ఆయన నివాసం, బంధువుల ఇళ్లు, షాపు తనిఖీలు నిర్వహించారు. ఇప్పటికే 100 కేజీల వెండి, 6 కేజీల బంగారం స్వాదీనం చేసుకున్నట్టు సీఐ సుబ్రహ్మణ్యం వివరించారు. తాజాగా ఆదివారం బంగారు దుకాణం తెరిచి తనిఖీలు నిర్వహించారు. బంగారం వ్యాపారి చేతుల్లో మోసపోయిన వారి జాబితా రోజు రోజుకు పెరుగుతోంది. ఇదిలాఉండగా మరి కొంత మంది లెక్కల్లో లేని బంగారం కూడా పట్టుకుపోవడంతో కొందరు ఫిర్యాదు చేసేందుకు వెనకాడుతున్నారని సమాచారం. ఇప్పటికే వంద కేజీల వెండి, ఆరు కేజీల బంగారం స్వాదీనం చేసుకున్న పోలీసులు మరింత చోరీ సొత్తు బయట పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. డీఎస్పీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో సీఐ సుబ్రహ్మణ్యం దర్యాప్తు చేస్తున్నారు.

వాష్ రూంలో విద్యార్థినుల ఫొటోలు తీసిన ఆకతాయిలు

పోక్సో కేసు నమోదు

ద్వారకాతిరుమల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పంగిడిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో వాష్ రూంకు వెళ్లిన విద్యార్థినులను ఇద్దరు ఆకతాయిలు చెట్టుపై నుంచి సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీశారు. కొందరు విద్యార్థులను రోజూ వెంబడించడం, అసభ్యకరంగా సైగలు చేస్తున్నారని వారిపై ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై శనివారం పాఠశాల విద్యా కమిటీ ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ సుధీర్ ఆదివారం పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వేంపాడుకు చెందిన పెండ్లి సందీప్‌కుమార్, జోనుబోయిన జితేంద్ర ఈ అకృత్యానికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. విద్యార్థినులు శుక్రవారం ఉదయం బాత్రూంకు వెళ్లారు. ఆకతాయిలు సమీపంలోని చెట్టుపై నుంచి సెల్‌ఫోన్‌తో ఫొటోలు తీయడం గమనించిన విద్యార్థినులు ఉపాధ్యాయులకు చెప్పారు. వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా తప్పించుకుని పారిపోయారు. తర్వాత విద్యార్థినులు తల్లిదండ్రులకు చెప్పారు. శనివారం ఉదయం పాఠశాలకు చేరుకుని తమ పిల్లలకు పాఠశాలలో భద్రత లేదని ఆందోళన చేశారు. ఉపాధ్యాయుల తీరును దుయ్యబట్టారు. దీంతో సచివాలయ మహిళా పోలీస్ విద్యార్థినుల నుంచి రాతపూర్వక ఫిర్యాదు తీసుకున్నారు. పాఠశాల విద్యా కమిటీ ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలవరం సందర్శనకు అనుమతి తప్పనిసరి

- విద్యార్థులను అడ్డుకున్న సెక్యూరిటీ
- తర్వాత అనుమతించిన అధికారులు



ప్రాజెక్టు యాత్రకు వచ్చిన స్కూలు బస్సులు

పోలవరం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా గొల్లలమామిడాడ ప్రైవేటు స్కూలు విద్యార్థులు ఆదివారం పోలవరం ప్రాజెక్టు సందర్శించారు. ఏడు బస్సుల్లో 350 మంది విద్యార్థులు అక్కడికి చేరుకోగా అనుమతి లేదని ప్రాజెక్టు భద్రతా బలగాలు అడ్డుకున్నారు. 100 కిలో మీటర్ల నుంచి వచ్చామని, అనుమతించాలని కోరినా భద్రతా సిబ్బంది అంగీకరించలేదు. ఉన్నతాధికారులను ఫోన్‌లో సంప్రదించడంతో ఈఈ వెంకటరమణ విద్యార్థులను ప్రాజెక్ట్ సందర్శనకు అనుమతించారు. స్పిల్‌వే, ప్రాజెక్ట్ నిర్మాణ పనులు పరిశీలించారు. ప్రాజెక్టు సందర్శనపై సీఈ నరసింహమూర్తిని వివరణ కోరగా ముందుగా అనుమతి తీసుకోవాలన్నారు. వెసులుబాటుని బట్టి సంబంధిత ఇంజనీర్లు డెమో ఇస్తారని ఆయన తెలిపారు.



ఎమ్మెల్యే రఘురామ సమక్షంలో చేరిన కాళ్ళ ఎంపీపీ శిరీష, కుముదవల్లి సర్పంచ్ వంశీకృష్ణంరాజు, వార్డు మెంబర్లు

ఉండి టీడీపీలోకి వలసల జోరు

కాళ్ళ/పాలకోడేరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఉండి నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపలోకి చేరికలు జోరందుకున్నాయి. కాళ్ళ మండలం పెద అమిరం గ్రామంలోని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం కాళ్ళ ఎంపీపీ పెన్మెత్స శిరీషతోపాటు పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా రఘురామ మాట్లాడుతూ వైసీపీ నుంచి టీడీపీలోకి నాయకులు చేరడం శుభపరిణామమన్నారు. నియోజకవర్గాన్ని రానున్న సంక్రాంతిలోపు మరింత అభివృద్ధి చేస్తామన్నారు. టీడీపీ కాళ్ళ మండలాధ్యక్షుడు జీవీ నాగేశ్వరరావు, పెన్మెత్స విశ్వనాథరాజు, వేగేశ్న రమేష్‌రాజు, యలమంచిలి వెంకటరమణ పాల్గొన్నారు. అనంతరం పది మందికి వైద్య ఖర్చుల నిమిత్తం 'ముఖ్యమంత్రి సహాయ నిధి' నుంచి మంజూరైన రూ. 10,41,246 చెక్కులను ఆదివారం లబ్ధిదారులకు అందించారు.

టీడీపీలో చేరిన వారి వివరాలు

కాళ్ళ ఎంపీపీ పెన్మెత్స శిరీష, జడ్పీటీసీ పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, కోపల్లె ఎంపీటీసీ లంకా భవాని, కోలనపల్లి ఎంపీటీసీ వేగేశ్న సత్యనారాయణరాజు, మాలవానితిప్ప ఎంపీటీసీ గొట్టుముక్కల బలరామకృష్ణంరాజు, కోపల్లె శివాలయం ఛైర్మన్ వేగేశ్న వెంకట రామరాజు, ఉండి మండలం ఉణుదుర్రు సర్పంచ్ నాగలక్ష్మి, ఎంపీటీసీ అల్లూరి ఆంజనేయరాజు, వైసీపీ గ్రామ అధ్యక్షుడు కూనపురాజు వర్మ, ఎన్ఆర్‌పీ అగ్రహారం సర్పంచ్ సురవరపు కనకదుర్గ దంపతులు, దేవస్థానం సభ్యులు కోరుకొండ ఝాన్సీ దంపతులతోపాటు పలువురు నాయకులు చేరారు. పాలకోడేరు మండలం కుముదవల్లి గ్రామ సర్పంచ్ వంశీకృష్ణంరాజు, వార్డు సభ్యులు 150 మంది కార్యకర్తలతో కలసి ఆదివారం సాయంత్రం రఘురామ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో రమేష్‌రాజు, సుబ్బరాజు, సత్యనారాయణరాజు వార్డు సభ్యులు ఉన్నారు.

• డిప్యూటీ స్పీకర్‌ను ఏపీ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు జి.సూర్యనారాయణరాజు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా 2025 సంవత్సరం సంఘ క్యాలెండర్‌ను డిప్యూటీ స్పీకర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు.


3 కే రన్ లో పాల్గొన్న టీబీఆర్ ఛైర్మన్ భోగేశ్వరరావు తదితరులు

ప్రతి ఒక్కరూ దేశభక్తిని అలవర్చుకోవాలి

పెంటపాడు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ దేశభక్తిని అలవర్చుకోవాలని విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ కేజీ కృష్ణ అన్నారు. అలంపురం టీబీఆర్ సైనిక్ స్కూల్ అధినేత తనుబుద్ది భోగేశ్వరరావు ఆధ్వర్యంలో 1971లో పాకిస్తాన్‌పై భారత్ సైన్యం సాధించిన విజయానికి గుర్తుగా ఆదివారం 3కే రన్ ఘనంగా నిర్వహించారు. టీబీఆర్ సైనిక్ స్కూల్ నుంచి ప్రత్తిపాడు కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం మీదుగా టీబీఆర్ డిఫెన్స్ అకాడమి శిక్షణ కేంద్రం వరకు సుమారు వెయ్యి మంది 3కే రన్‌లో పాల్గొన్నారు. సైనిక సంక్షేమ శాఖ సంచాలకులు, బ్రిగేటియర్ వి.వెంకటరెడ్డి, జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి సాయిప్రసాద్‌రావు మాట్లాడారు. అనంతరం భోగేశ్వరరావు ఆధ్వర్యంలో 1971 యుద్ధంలో పాల్గొన్న 20 మంది మాజీ సైనికులను సత్కరించారు. 3కే రన్‌లో బాలురు, బాలికల విభాగంలో విజయం సాధించిన వారికి నగదు బహుమతి అందజేశారు. రూరల్ సీఐ రమేష్, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, గట్టిం మాణిక్యాలరావు, పుల్లా బాబి, చెరుకూరి జగత్ సోమశేఖర్, బొల్లం వీరయ్య, ఉడిమూడి రాజు, కరస్పాండెంట్ పద్మా వతి, సీఈవో రవికిరణ్, హెచ్ఎం కళ్యాణి, ఏవో నాగరాజు పాల్గొన్నారు.

అబాకస్ విజేతలకు ఎమ్మెల్యే అంజిబాబు అభినందన


విజేతలను అభినందించిన ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరంటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి):అబాకస్ ఇంటర్నేషనల్- 24వ ప్రపంచ స్థాయి పోటీల్లో భీమవరం యూసీ మాస్ సెంటర్ విద్యార్థులు తృతీయ స్థానం సాధించడం పట్టణానికే గర్వకారణమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. ఈనెల 14, 15 తేదీల్లో న్యూఢిల్లీలో జరిగిన ప్రపంచ స్థాయి అబాకస్ 2024 పోటీల్లో భీమవరం యూసీ మాస్ సెంటర్ విద్యార్థి రామిశెట్టి జగదీష్ మూడో స్థానం సాధించారన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. వీరికి శిక్షణ ఇచ్చి న ఆకుల మౌనికను ప్రత్యేకంగా అభినందించారు. టీడీపీ రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వర రావు, సూర్యమిత్ర ఎగ్జిమ్స్ అధినేత యిర్రింకి సూర్యారావు, పొత్తూరి బాపిరాజు, అల్లు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా 'బాలోత్సవ్'

భీమవరం అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆదివారం మారుతీ నగర్ పార్క్‌లో బాలోత్సవ కార్యక్రమం బాలబాలికలతో సందడి వాతావరణంలో జరిగింది. ముఖ్యఅతిథిగా రిటైర్డ్ డీఈవో ఇందుకూరు ప్రసాద్‌రాజు హాజరై కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. పిల్లలకు చిత్రలేఖనం, లెమన్ స్పూన్, స్టోన్ గేమ్, శాక్ రేస్ వంటి క్రీడలను నిర్వహించారు. ఈ క్రీడలకు సుమారు వంద మంది బాలబాలికలు హాజరయ్యారు. క్రీడల అనంతరం ఏర్పాటు చేసిన బహుమాన ప్రదానోత్సవ సభకు మారుతీ నగర్ పార్క్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పావిరాల రామ్మోహన్ అధ్యక్షత వహించారు. గెలుపొందిన బాలబాలికలకు కామన నాగేశ్వరరావు, పంపన శ్రీనివాసు, వలవల నరసింహారావు, చేకూరి నరసింహరాజు, గాదిరాజు కృష్ణంరాజుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. బాలోత్సవ కమిటీ సభ్యులు చైతన్య ప్రసాద్, శిరీష జ్యోతి, జి.రాధ, తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ వజ్రోత్సవ వేడుకల్లో ఆరిమిల్లి

దుబాయ్‌లో ఆదివారం నిర్వహించిన ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, తదితరులు - తణుకు



మాధవనాయుడిని పరామర్శిస్తున్న నాయకర్, షరీఫ్, పొత్తూరి (ఇన్‌సెట్‌లో) ప్రతాప్‌నాయుడు (ఫైల్)

మాజీ ఎమ్మెల్యే 'బండారు'కు పితృవియోగం

నరసాపురం టౌన్/మొగల్తూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడుకు పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి ప్రతాప్‌నాయుడు(75) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి అనంతరం అంబులెన్స్‌లో విజయవాడకు తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందారు. దీంతో స్వగ్రామం నరసాపురం మండలం సరిపల్లికి తరలించారు ఆయన 1988లో సర్పంచ్‌గా, నీటి సంఘం అధ్యక్షులుగా పని చేశారు. సోమవారం అంత్యక్రియలు జరగనున్నాయి. ఆయన నేత్రాలను నిడదవోలు లయన్స్ ఐ-ఆస్పత్రికి దానం చేశారు. మృతదేహాన్ని ప్రభుత్వ విప్ నాయకర్, మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ షరీఫ్, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, ఎమ్మెల్సీ ఎం.అరుణ్ కుమార్, మాజీ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, ఛైర్‌పర్సన్ వెంకటరమణ, వీసీ కొత్తపల్లి నాని, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, యడ్ల తాతాజీ తదితరులు పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. కేంద్ర మాజీ మంత్రి యు.వి కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి, కూటమి నాయకులు సంతాపం తెలిపారు.

పేరుకుపోయిన చెత్త, గుర్రపు డెక్క

పెనుమంట్ర జీవీ కెనాల్, చినకాపవరం పాతవయ్యేరులో నీటి ప్రవాహానికి అడ్డంకి.. సాగునీటికి ఇబ్బందులు



పాతవయ్యేరులో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూడు (ఇన్‌సెట్‌లో) జీవీ కెనాల్‌లో తూడు

పెనుమంట్ర, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పెనుమంట్ర మండలంలో ప్రధాన సాగునీటి కాలువైన జీవీ కెనాల్‌లో నీటి ప్రవాహానికి తూడు చెత్తాచెదారం పేరుకుపోయి అడ్డంకిగా మారింది. ఎగువ నుంచి దిగివకు కోళ్లు, పశువుల కళేబరాలు కాల్వలో కొట్టుకు రావడంతో మాముడూరు బ్రిడ్జి వద్ద దుర్గంధం వెదజల్లుతోంది. దాళ్వా నారుమడులు వేస్తున్న రైతాంగానికి సాగునీరు అందించేందుకు దిగువ గ్రామాలకు తాగునీరు అందించేందుకు ఇదే ప్రధాన కాలువ కావడం గమనార్హం.

పాతవయ్యేరులో గుర్రపుడెక్క, తూడు

ఆకివీడురూరల్ : పాతవయ్యేరు కాల్వలో తూడు, గుర్రపుడెక్క పూడుకుపోవడంతో దిగువకు నీరు వెళ్లడానికి అడ్డంకిగా మారాయి. చినకాపవరం నుంచి కళింగగూడెం లాకుల వరకు సుమారు ఎనిమిది కిలోమీటర్ల మేర పాతవయ్యేరు కాలువ ప్రవహిస్తుంది. పలు గ్రామాలకు సాగునీరు, తాగునీరు అందిస్తుంది. గత ప్రభుత్వ హయాంలో ఈ కాల్వను అశ్రద్ధ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు ప్రత్యేక శ్రద్ధ పెట్టి కాల్వలను శుభ్రం చేశారు. అధికారులు పట్టించుకోకపోవడంతో మళ్లీ కాల్వ తూడు, గుర్రపుడెక్కతో పూడుకుపోయింది. నీటి సంఘాలు ఏర్పడిన నేపథ్యంలో తూడు, గుర్రపుడెక్క తొలగించి, సాగు, తాగునీరు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

సగర సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా 'ఏపూరి'

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సగర సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మోదుగగుంటకు చెందిన ఏపూరి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఏలూరులో నిర్వహించిన సంఘ ఎన్నికల్లో ఏపూరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మోదుగగుంట సర్పంచ్‌గా, ఉపసర్పంచ్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయనను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, సగర సంఘ నాయకులు అభినందించారు.

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత

ఆచంట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల అనారోగ్యంకు గురైన వారికి సీఎం రిలీఫ్ కింద మంజూరైన సీఎం రిలీఫ్ పండ్ చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అందజేశారు. కొడమంచిలికి చెందిన నెక్కంటి సూర్యకుమారికి రూ.లక్షా 25 వేలు, నున్నబోయిన నాగరాజుకు 44 వేలు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో చిలుకూరి శ్రీను, బాలం వెంకటరమణ, నెక్కంటి రామకృష్ణ పాల్గొన్నారు.



నారాయణ విద్యార్థుల ప్రతిభ

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పీఎస్ ఒలింపియాడ్ టాలెంట్ పరీక్షలో తాడేపల్లిగూడెం నారాయణ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు నిర్వహించే ఈ పరీక్షలను నారాయణ విద్యార్థులు 12 మంది రాయగా వంద లోపు మూడు ర్యాంకులు సాధించినట్టు నారా యణ ప్రిన్సిపాల్ ఎ.యాస్మీ తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు.



ముగిసిన త్యాగరాజ ఆరాధనోత్సవాలు

గణపవరం, డిసెంబరు22 (ఆంధ్రజ్యోతి) : సరిపల్లెలోని త్యాగరాజ కళాక్షేత్రంలో త్యాగరాజస్వామి 37వ వార్షిక సంగీత ఆరాధనోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈనెల 18న ప్రారంభమైన ఉత్సవాలు ఆఖరి రోజు సాగిరాజు సుబ్బరాజు, వరలక్ష్మి సౌజన్యంతో ఏర్పాటు చేసిన వీణకచేరి నిర్వ హించారు. ద్విభాష్యం నగేష్‌బాబు, మృదంగం కె. యోగేష్, గటం సరస్వతుల హనుమంతరావు నిర్వహించారని వ్యవస్థాపకుడు మాజేటి సురేష్ శ్రేష్టి తెలిపారు.

సీపీఐ శత వసంతాలను జయప్రదం చేయాలి

భీమవరం అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ శత వార్షికోత్సవాలను ఈనెల 26న జయప్రదం చేయాలని సీపీఐ భీమవరం ఏరియా కార్యదర్శి చెల్లబోయిన రంగారావు పిలుపునిచ్చారు. సీపై భీమవరం పట్టణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో సీపీఐ శత వసంతాల ఉత్సవాలపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డిసెంబరు 26 నాటికి దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి నూరు వసంతాలు పూర్తవుతాయన్నారు. శత వార్షికోత్సవం పురస్కరించుకుని ప్రజల్లోకి వెళ్లాలని, పార్టీని బలోపేతం చేసే కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎం.లక్ష్మీపతి, వైవీ ఆనంద్, పాలా త్రిమూర్తులు, పి.యాకోబు తదితరులు పాల్గొన్నారు.

సాయిలచ్చిరాజుకు అభినందనలు

ఉండి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉండి డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంతెన సాయిలచ్చిరాజును మండల సమాఖ్య అధ్యక్షురాలు కర్రి జయలక్ష్మీశ్రీను దంపతులు కలిసి అభినందనలు తెలిపారు. ఆదివారం ఉండి రాజులపేటలోని సాయిలచ్చిరాజు నివాసానికి మండల సమాఖ్య అధ్యక్షరాలు కర్రి జయలక్ష్మీ, ఆమె భర్త మండల తెలుగురైతు ప్రధాని కార్యదర్శి శ్రీనివాసు, మండల వాణిజ్య ప్రధాన కార్యదర్శి సారేపల్లి త్రిమూర్తులు కలిసి అభినందనలు తెలిపారు. పాకలపాటి రామరాజు తదితరులున్నారు.

ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు


విద్యార్థులకు బహుమతులు అందించిన దృశ్యం

భీమవరంటౌన్/ఆకివీడు రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గణిత మేధావు లలో శ్రీనివాస రామానుజన్ ఒకరని అరసవల్లి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహంలో శ్రీనివాస రామానుజన్ జయంతి కార్యక్రమాన్ని శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, హాస్టల్ వార్డెన్ శ్యామల మాట్లా డుతూ చిన్న వయసులోనే గణితశాస్త్రంలో తనకున్న పట్టును చాటుకున్న రామానుజన్ గణితశాస్త్ర జీనియస్‌గా చరిత్రలో నిలిచి పోయారన్నారు. అనంతరం విద్యార్థులకు పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.

• ఆకివీడు మండలం దుంపగడపలోని జడ్పీ పాఠశాలలో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. ఉపాధ్యాయులు పెంకి విజయ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


మాంటిస్సోరి, ప్రగతి కాలేజి విద్యార్థుల యోగా

'యోగా' దినచర్యలో భాగం కావాలి

తణుకు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థికి యోగా దినచర్యలో భాగం కావాలని మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, డీవైఈవో డి.మురళీసత్యనారాయణ అన్నారు. మాంటిస్సోరి స్కూలులో ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా మాంటిస్సోరి, ప్రగతి కాలేజి విద్యార్థులతో కలిసి యోగా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మాంటిస్సోరి స్కూలు డైరెక్టరు అనపర్తి ప్రకాశరావు, ప్రగతి కాలేజి డైరెక్టర్ ప్రగతి రాజు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు జ్ఞానమంజరి, హెచ్ఎం లక్ష్మీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి

ఇరగవరం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు చట్టాలపై అవగాహన కలిగినప్పుడే నేరాల సంఖ్య తగ్గుతుందని తణుకు నాలుగో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం అంగన్‌వాడీ కార్యకర్తలకు, డ్వాక్రా మహిళలకు న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఏదైనా ఘటనలు జరిగినప్పుడు ఎలా రక్షణ పొందాలి, దైనందిన జీవితంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలి తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. సమస్యలు ఎదురైనప్పుడు న్యాయసేవల సంస్థ టోల్‌ఫ్రీ 15100ను సంప్రదించాలని తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణ సత్యలత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయవాది సి.సాయిరామ్, రెండో అదనపు జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఏవీ నాగరాజు, స్పెషల్ కోర్టు మెజిస్ట్రేట్ ఏవీఎస్ చిరంజీవిరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూరంపూడి కామేష్, ఆర్డీవో దాసిరాజు తదితరులు పాల్గొన్నారు.


2003-04లో టెన్త్ చదివిన విద్యార్థులు

ఆకివీడులో పూర్వ విద్యార్థుల కలయిక

ఆకివీడు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 2003-04 ఏడాదిలో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం కలిశారు. 20 ఏళ్ల తరువాత ఆత్మీయ సమ్మేళనంలో పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పాత మిత్రులు ఆనాటి జ్ఞాపకాలతోపాటు. వారి కుటుంబ సభ్యులను స్నేహితులకు పరిచయం చేసుకుని సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు.

రైతులకు మేలు చేయడమే లక్ష్యం : మార్రాజు

నరసాపురం టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులకు మేలు చేయడమే లక్ష్యమని డెల్టా ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు గుబ్బల మార్రాజు అన్నారు. ఆదివారం జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ పదవి రావడానికి విప్ నాయకర్ కృషి ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా పూడికపోయిన కాల్వలు, మురుగు బోదెలను ఆధునీకీకరించి శివారు ప్రాంతాలకు సాగునీటిని అందించాలన్నదే లక్ష్యమన్నారు. మార్రాజును శెట్టి బలిజ ఎన్‌డీఏ నాయకులు, యువసేన ఎన్‌డీఏ బొకే అందించి అభినందనలు తెలిపారు. గుబ్బల నాగరాజు, ఎం.సత్యనారాయణ, కడలి మోహన్, చంటి, డి.సత్యనారాయణ, చిట్టిబాబు, తంగెళ్ల నాగేశ్వరరావు, వీరస్వామి, బలిచక్రవర్తి, పద్మారావు, కుక్కల రవి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వేంకటేశ్వర స్వామికి వెండి పాదాల బహూకరణ


శ్రీవారికి వెండి పాదాలు అందజేస్తున్న భక్తులు

పెనుగొండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పెనుగొండ నగరేశ్వర మహిషాసుర మర్ధని కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వున్న వేంకటేశ్వర స్వామికి అమెరికా వాస్తవ్యులు సత్తి రామకృష్ణారెడ్డి, శ్వేతా చంద్రిక దంపతులు ఈవోకు రూ.75 వేల విలువైన వెండి పాదాలను బహుమతిగా అందజేశారు. వీరిని ఈవో సత్కరించారు. తేతలి శ్రీరామారెడ్డి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

150 కేజీల పసుపు కొమ్ములతో అలంకరణ

భీమవరంటౌన్ : ధనుర్మాసం సందర్భంగా జ్యువలపాలెం రోడ్డులోని పద్మావతి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలోని అమ్మవారికి 150 కేజీల పసుపు కొమ్ములతో ఆదివారం ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

• నరసాపురం రూరల్ : ఎల్‌బీచర్ల గ్రామంలో కొలువైన గంగాలమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు పసుపు, కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవార్ని గులాబీ, బంతి, చామంతి పువ్వులతో ప్రత్యేక అలంకరించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు

• పాలకొల్లు అర్బన్ : భాను సప్తమి సందర్భంగా స్థానిక కోడి గట్టున ఉన్న శ్రీసూర్యదేవాలయంలో ఆదివారం అర్చకులు సుబ్రహ్మణ్యం, స్వామివారికి ఆవు పాలతో ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు పొంగలి ప్రసాదం అందజేశారు.

హైందవ నాయకుల బైక్ ర్యాలీ

నరసాపురం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సీతారాంపురం నుంచి మొగల్తూరు పోలీస్‌స్టేషన్ వరకు హైందవ నాయకులు ఆదివారం గ్రామస్థులతో కలిసి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని సత్తెమ్మ అమ్మవారి ఆలయాన్ని తొలగించాలని వేసిన పిటీషన్‌ను వెనక్కి తీసుకోవాలని నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ర్యాలీలో హిందువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం డీఎస్పీ కార్యాలయానికి ర్యాలీగా వచ్చి డీఎస్పీ శ్రీవేదకు గణపతిరాజు, కస్తూరి రంగ, సయ్యపు వర్మ వినతిపత్రం అందించారు. జంపన సుబ్బరాజు, శ్రీనివాస రాజు, గ్రామస్తులు, హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మీ భద్రత కోసమే హెల్మెట్ : సీఐ

భీమవరం క్రైం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : 'మీ భద్రత కోసం హెల్మెట్ ధరించాలని, జరిమానా నుంచి తప్పించుకునేందుకో, పోలీసుల కోసమో కాదు' అని భీమవరం ట్రాఫిక్ సీఐ నారాయణమూర్తి సూచించారు. శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భీమవరం అంబేడ్కర్ సెంటర్‌లో హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఎస్ఐ గగారియాన్, నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ హెల్మెట్ ఒక రక్షణ కవచంగా ఉపయోగపడుతుందన్నారు. కాగిత సురేంద్ర, దాలయ్య, కారుమూరి సత్యనారాయణమూర్తి, భట్టిప్రోలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'చాంబర్' ప్రధాన కార్యదర్శిగా నాగేంద్ర కుమార్

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శిగా కఠారి నాగేంద్రకుమార్ నియమితులయ్యారు. ఛాంబర్ కార్యాలయంలో అధ్యక్షుడు కేవీఆర్ నరసింహారావు అధ్యక్షతన ఆదివారం జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శిగా నాగేంద్ర కుమార్‌ను నియమించినట్టు అధ్యక్షుడు నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా చాంబర్ సభ్యులతో పాటు పలు సంఘాల నాయకులు ఆయనను అభినందించారు.

ప్రజా చైతన్యమే రాజ్యాంగానికి రక్షణ కవచం

తణుకు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన పాలకులే దానిని ఉల్లంఘిస్తున్నారని మాజీ ఎంపీ వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. ఆదివారం తణుకు రాజ్యాంగ ప్రచార వేదిక సమన్వయకర్త డీవీవీఎస్ వర్మ అధ్యక్షతన సురాజ్య భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగానికి రక్షకులుగా ఉండాల్సిన న్యాయమూర్తులు దానికి విరుద్ధంగా తీర్పులు, ప్రకటనలు చేస్తున్న పరిస్థితుల్లో పౌరసమ సంస్థలు కల్పించే ప్రజా చైతన్యమే రాజ్యాం గానికి రక్షణ కవచం అవుతుందన్నారు. విశ్రాంత ఐఏఎస్ బండ్ల శ్రీనివాసు మాట్లాడుతూ ప్రజా రిపబ్లిక్ భావన ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. ఏఐటీయూసీ కోనాల భీమారావు, సీఐటీయూ నాయకులు పీవీ ప్రతాప్, సామాజిక న్యాయపోరాట సమితి వ్యవస్థాపకులు మురళీకుమార్, డాక్టర్ గుబ్బల తమ్మయ్య, ఎస్.మనోరమ, డాక్టర్ రమేష్‌చంద్రబాబు వ్యవహరించారు. పట్టణానికి చెందిన సంస్థలు, పౌర సమాజ సంస్థలు, ప్రజా సంఘాలు ప్రతినిధులు పాల్గొన్నారు.

పీవీ రావుకు ఘన నివాళి

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) మాలల యుగ పురుషుడు, మాలల సంక్షేమానికి అలుపెరుగని పోరాటం చేసిన ధీరుడు పీవీ రావు అని పలువురు వక్తలు అన్నారు. స్థానిక గాంధీ బొమ్మల సెంటర్‌లో ఆదివారం మాల మహానాడు వ్యవస్థాపకుడు పీవీ రావు 19వ వర్ధంతిని గుమ్మాపు సూర్యవరప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు కొర్రపా టి వీరాస్వామి, మానుకొండ శ్రీను, ఇంజేటి కుమార్, దేవా రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

కొమ్మరలో మెగా వైద్య శిబిరం

అత్తిలి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కొమ్మర గ్రామంలో గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని భీమవరం వర్మ ఆసుపత్రి వారు నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన 310 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో మెరుగైన చికిత్స కోసం 32 మందిని భీమవరం ఆసుపత్రికి రిఫర్ చేశారు. 190 మందికి ఉచితంగా మందులు అందజేశారు. గ్లోబల్ ఫౌండేషన్ ప్రతినిధులు నడింపల్లి వెంకటరామరాజు, రుద్రరాజు లక్ష్మీపతిరాజు, మంతెన ధర్మతేజ, ఫౌండేషన్ ప్రతినిధి మంతెన యోగేంద్ర కుమార్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.